# శుక్రమహార్దశ

సాయంకాలం ఐదున్నర గంటలైంది.

అది ఒక పెద్ద లోగిలి. అందులో అయిదారు కాపురాలు ఉన్నాయి. అ ఊరొక జిల్లా కేంద్రం. అప్పుడే ఆఫీసుల నుండి వచ్చిన వారంతా కాళ్ళూ, చేతులూ కడుగుకొని కాఫీలు ముగించుకొన్నారు. మగవాళ్ళొక గ్రూపుగా ఏర్పడి పేకాట మొదలెట్టారు. ఆడవాళ్ళంతా ఒకచోట కూర్చుని లోకాభిరామాయణం చెప్పుకుంటున్నారు.

ఆడవాళ్ళ బృందానికి లీడర్ మోహిని. ఆమె చుట్టూ నలుగురు ఆడవాళ్ళు కూర్చుని ఉన్నారు. ఇద్దరు బి. ఎ. స్టూడెంట్సు. మిగతా ఇద్దరూ పాతిక సంవత్సరాల లోపలి గృహిణులు. వాళ్ళ నలుగురికీ మోహిని మాటలు వేదవాక్యం. ఆమెకు తెలియని విషయాల్లు లేవని వారి నమ్మకం.

మోహిని వయస్సు ముప్పై నాలుగు సంవత్సరాలు. బి.ఎ. పాసై ఒక ప్రైవేట్ కంపెనీలో స్టెనోగా పనిచేస్తున్నది. జీతం ఆరు వందల పైనే ఉంటుంది. అవివాహితురాలు. మోహిని మాట్లాడుతున్నది: "ఈ వరకట్నాలు నశించిపోతా యనుకున్నాను. ఇరవై సంవత్సరాల క్రిందట అవి నశించకపోగా, ఇంకా విజృంభించి ఆకాశాన్నంటుకుంటున్నవి. ఈ దురాచారం మన సంఘంలో ఎప్పుడు పోతుందో అర్థంగావటం లేదు..."

ఆమె దగ్గర కూర్చున్న గృహిణులలో ఒకామె—మాయ—అందుకున్నది. ఆమె భర్త ఒక ఎల్. డి. సి. ఆమె నాలుగేళ్ళ క్రిందట ఐదువేలు కట్న మిచ్చి పెండ్లి చేసుకుంది. ఇప్పటి కిద్దరు బిడ్డలు.

"ఏమోలెండి. మనం ఎన్ననుకున్నా, కట్నాలు తీసుకునేవారు తీసుకుంటున్నారు. ఇచ్చేవా రిస్తూనే ఉన్నారు. ఎన్ని పత్రికలకు కట్నాలు పోవలెనని కథలూ, నవలలూ, వ్యాసాలూ వ్రాసినా అరణ్య రోదనే" అన్నది మాయ.

మోహిని ముఖం ఉక్రోషంతో ముడిపడ్డది. అసలే మన్నితమై, పచ్చగా ఉన్న ఆమె ముఖం కంబగడ్డలా ఎరుపెక్కింది. ఆమె పక్కనున్న కాలేజీ స్టూడెంట్లు ఇద్దరూ ఆశగా, ఆరాధనగా ఆమె వైపు చూస్తున్నారు. మోహిని అందగత్తె గాక మంచి వక్త. రచయిత్రి. ఇప్పటికే పది నవలలు, పాతిక కథలు వ్రాసింది. అన్నింటికంటే స్త్రీ సమస్యలు, వరకట్నాల నిషేధం, వితంతు స్త్రీ పునర్వివాహాలు... ఆమెకు అభిమానమైన టాపిక్సు.

దూరంగా మగాళ్ళు పేకాడుకుంటున్నారు. వారు నలుగురున్నారు. ముగ్గురు గృహస్థులు. ఒకడు పాతికేళ్ళు నిండని బ్రహ్మచారి. వాళ్ళకు పేకాట మీద శ్రద్ధ తగ్గినట్లుంది. ఒక చెవి ఆడవాళ్ళ వైపు పారేసి యాంత్రికంగా, అయిష్టంగా, నచ్చుగా ఆడుతున్నారు, వరకట్నాల టాపిక్ ఆడవాళ్ళలో రాగానే.

"ఇదిగో, ఇలా మన ఆడవాళ్ళే దిగజారిపోతోంటే ఏం చేయగలం? మనం అంతా ఒక కట్టుగా ఉండాలి. కట్నా లడిగే పురుషులను వివాహమాడరాదు. కట్న ప్రసక్తి ఉండే పెండ్లిండ్లకు పోగూడదు. కట్నం ఇచ్చిన స్త్రీని సాంఘికంగా బహిష్కరించాలి ..." అంటూ ఆవేశంగా ఊగిపోతున్నది మోహిని.

## చివుకుల పురుషోత్తం

మాయ అన్నది: "ఏమిటోలెద్దురూ? ఇప్పుడు మన లోగిలిలో ఇన్ని కుటుంబాలున్నాయి గదా? అందరం సయోధ్యతగా ఉండటంలేదూ? ఇక్కడ కట్నం ప్రసక్తి లేకుండా పెండ్లి చేసుకున్నవా రెవరు? ఎవరూ లేరు. ఇక ఎవరు ఎవర్ని బహిష్కరించాలి? బహిష్కారం అంటూ జరగవలసివస్తే హాయిగా నాలుగు సంసారాల మధ్య నిశ్చింతగా ఉన్న మీరే బయటకు వెళ్ళవలసి ఉంటుంది. ఏ బ్రహ్మచారుల రూముల పక్కనో చేరాలి.. అది సరే. రేపు మీరైనా సరే, వరకో కట్నం ఇవ్వకపోతే పెండ్లవుతుం దంటారా?"

"నేను చచ్చినా కట్నం ఇచ్చి పెండ్లి చేసుకోను. అసలు ఆ నిర్ణయం వల్లనే మొదట్లో చాలా సంబంధాలు ఒప్పుకోలేదు" అన్నది మోహిని గర్వంగా.

అంతవరకూ విన్న బ్రహ్మచారి పేక ముక్కలు నేలకి కొట్టేసి, "ఏమండోయ్, మోహిని గారూ! మీరు కట్నం ఇచ్చి పెండ్లి చేసుకోనని భీష్మ ప్రతిజ్ఞ చేశారు. బాగుంది. కాని, కట్నం ఇవ్వందే మీ రనుకున్నట్లు పెండ్లి కాదు. పెండ్లి చేసుకోకుండా ఉండి చచ్చిపోతే మీరు కట్నం ఇవ్వక తప్పదు" అన్నాడు. బ్రహ్మచారి పేరు గోవిందరావు. అతడికి పాతికేళ్ళుంటాయి. అతను చిన్న ఎల్. డి. సి. ఉద్యోగం చేస్తున్నాడు. ఇంటర్ దాకా చదివాడు. వెనకా ముందూ ఎవరూ లేని వాడు.

మోహినికి, గోవిందరావుకు చిత్రమైన స్నేహం. ఆ లోగిలిలో సామాన్యంగా ఆడవాళ్ళూ, మగవాళ్ళూ విడివిడిగా కాలక్షేపం చేస్తుంటారు సాయంకాలాలు, సెలవులలో. ఎప్పుడైనా వరకట్నాలు, ప్రేమ వివాహాలు లాంటి టాపిక్స్ వస్తే అందరూ వాదనలు ప్రారంభిస్తారు. అందరూ పరిచయస్థులు కావటంతో ఎవరి అభిప్రాయాలను వారు నిర్భయంగా బయటపెట్టి చర్చిస్తుంటారు. అలాటి వాదనలలో మోహినీ, గోవిందరావుల నడుమ పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. వారి వాదనలు వింటూంటే చూచేవారికి భయంకరంగా ఉంటుంది. పైనబడి కొట్టుకుంటారేమో అని కూడా అనిపిస్తుంటుంది. కానీ, మోహినికి గోవిందరావంటే అభిమానం, గౌరవం ఉన్నాయి—వాదించేప్పుడు తప్ప. ఎందుకంటే, మోహిని అభిప్రాయం ప్రకారం గోవిందరావు నిష్కల్మషంగా ఆలోచిస్తాడు. అలానే ప్రవర్తిస్తాడు. తన అభిప్రాయాలను మొరటుగా బయట పెడతాడు.

మెరమెచ్చులు మాటలు మాట్లాడి నిజ జీవితంలో తద్భిన్నంగా ప్రవర్తిస్తూ, సమయం వచ్చినప్పుడు బుట్టలో పెట్టడానికి ఉచ్చులు పన్నే మగవారితో విసిగిపోయిన మోహినికి గోవిందరావు మాట్లాడుతూంటే హాయిగా ఉంటుంది. మోహిని ఈ మగ ప్రపంచంలో తిరిగేటప్పుడు పదివేల రూపాయల సంచీ పట్టుకొని రైలు ప్రయాణం చేసే ప్రయాణీకురాలివలె అనుక్షణం జాగ్రత్తగా ఉంటుంది. కానీ, గోవిందరావుతో మాట్లాడేటప్పుడు మట్టుకు ఆ డబ్బుసంచీ అలా పారేసి నిశ్చింతగా నిద్ర పోగల ననుకుంటుంది. ఆమె అభిప్రాయం ప్రకారం గోవిందరావు వాదనలో రాక్షసుడు. అతడు వాదించేటప్పుడు వెలువడే భావాలు మోహిని కసహ్యం, కోపం కలిగించినప్పటికీ మిగతా సమయాలలో అమాయకుడైన పసిబిడ్డను జ్ఞప్తికి తెస్తాడు.

కానీ, ఒక్కటే న్యూసెన్సు మోహినికి. గోవిందరావు ఐడియాలన్నీ జపాన్ తుమ్మ ముళ్ళకంప వలె ఉంటాయి మోహినికి. అవి గుచ్చుకున్నప్పుడే గాక, తరవాత గూడా బాధిస్తాయి. మోహిని ఆశయం రెండేళ్ళుగా ఇది — గోవిందరావును ఆధునిక భావ సంపన్నుడుగా తయారుచేయాలని. ఒక్క మగాణ్ణయినా సరే, తమ మహిళా ఉద్యమాన్ని త్రికరణ శుద్ధిగా బలపరిచేవాడుగా తయారు చేయాలని ఆశిస్తుంది. కొద్ది చదువు, చిన్న వయస్సు, మంచి మనస్సు ఉన్న గోవిందరావైతే తన భావాలకూ, వాదనలకూ లొంగుతాడని ఆమె ఆశ.

గోవిందరావు మోహిని కొక జెంటిల్ మన్ ఫ్రెండ్. అతణ్ణి సెలవులలో, పండుగలలో భోజనానికి పిలుస్తుంటుంది. అతడామెకు రేషన్ సరుకులు తెచ్చిపెట్టడం, చిల్లర మల్లర బజారు పనులు చూడడం చేస్తాడు.


గోవిందరావు మాటలు వినగానే మాయ భర్త మళ్ళీ రసవత్తరమైన వాదన జరగబోతున్నదని ఊహించి పేక ముక్కలు క్రింద పారేసి ఆడవాళ్ళు కూర్చున్న మంచాని కెదురుగా మంచం వేసి కూర్చున్నాడు. మిగతా ముగ్గురు కూడా పేక సర్ది వచ్చి మంచం మీద కూర్చున్నారు.

గోవిందరావు అన్నాడు మళ్ళీ: "మోహినిగారూ! మీరు కట్నం ఇవ్వందే మీకు పెండ్లి కాదు. మీరు చచ్చిపోయినా సరే— కట్నం ఇవ్వక తప్పదు."

గోవిందరావు మాటలు వినగానే భగ్గున మండుకొచ్చింది మోహినికి. రెండు రోజుల క్రిందట ఆమెకూ, గోవిందరావుకూ జరిగిన వాదన జ్ఞప్తికొచ్చి ఇంకా కోపం వచ్చింది. గోవిందరావు మోహిని కథలుగానీ, నవలలుగానీ చదవడు. మాయ భర్త చేత కథ టూకీగా చెప్పించుకుని, రోజుల తరబడి— 'పట్టి చచ్చుకథ— మీ ఆడాళ్ళకు నచ్చుతుందేమోగాని, మాకు నచ్చదు' అంటాడు. గోవిందరావు తెలుగు నవలలు చదవడు. అందులో రచయిత్రుల నవలలు అసలు ముట్టడు.

రెండు రోజుల క్రిందట మోహిని స్వంతంగా ప్రచురించిన నవల 'అబల'ను గురించి గోవిందరావు చేసిన విమర్శవల్ల ఆమె అందరిలో అపహాస్యం పాలైంది. ఆ కథను మాయ భర్త టూకీగా చెప్పాడు గోవిందరావుకు.

కథ ఏమంటే, సరోజ అనే యువతి బి. ఎ. ఫైనల్ చదువుతూ ఉంటుంది. క్లాస్‌మేట్‌ను ప్రేమిస్తుంది. అతడొక లక్షాధికారి బిడ్డ. కులం ఒకటే. ఆమె ప్రేమను హద్దుల్లో పెట్టుకోలేక పోతుంది, ఒకే ఒక రోజున. ఫలితంగా గర్భవతి అవుతుంది. ఆ సంగతి రూఢి అయిన పిదప, అంటే నాలుగో మాసం వచ్చిన తరవాత తన ప్రియుని కలుసుకొని



...ఆమె పెళ్ళి చేసుకోమంటుంది. కానీ, ...యుడు బి. ఎ. అయ్యేదాకా ఆగ ...న్నాడు. దానితో ఆమె అతణ్ణి తిట్టి తెగతెంపులు చేసుకొని ఇంటికి ...ంది. మరో రెండు నెలలకు సంగతి ...ల్లో తెలిసి సరోజ అన్నలు, తండ్రి ...ను ఇంటినుండి గెంటేస్తారు, పట్న... పదిమంది ముందర. తరవాత ...నాలుగు నెలలు అనేక కష్టాలు పడు ...ంది సరోజ. ఆమె ఇప్పుడు నిండు ...లు. **అప్పుడు ఒకే తోటవ ఇద్దరు మగవాళ్ళు** తారసపడి ఆమెను అవమానింప చూస్తారు. కానీ, ఆమె శీలాన్ని రక్షించుకుంటుంది. ఆఖరుకు ఈ మగ ప్రపంచంలో బ్రతకలేక రైలు క్రింద పడి ఆత్మహత్య చేసుకుంటుంది. ఇదీ మోహిని ప్రథమ దుఃఖాంతపు నవల.

దీనికి గోవిందరావు వ్యాఖ్య: "మోహినిగారూ! మీ రీ నవల వ్రాసి వేలు సంపాదించుకొన్నారు గదా? బి. ఎ. చదివే మీ హీరోయిన్‌కు ఓ పావలాపెట్టి **ఫామిలీప్లానింగ్ బిళ్ళ కొనిపెట్టకూడదూ?** లేక ఐదు పైసలు పెట్టి మీ హీరోకో నిరోధ్ కొని ఇచ్చి ఉంటే మీ కథ ఎక్కడుండేది? మీకు పుణ్యముంటుంది. —ఈ నవలను అంతర్జాతీయ నవలల పోటీలకు లండన్, న్యూయార్కులకు పంపకండి. అక్కడి ఆడవారంతా పొట్టలు చెక్కలయ్యేలాగున నవ్వి చావగలరు. ప్రతి బీడీబంకులో నిరోధ్‌లమ్మే ఈ రోజుల్లో, చట్టరీత్యా వేలిమీది గోరువలె కడుపులు తీయించుకోవడానికి వీలున్న ఈ **రోజుల్లో, స్త్రీకి వివాహం అవసరం** లేకనే పిల్లలు కనుక్కోడానికి వీలు కల్పించే చట్టాలను తేవాలనుకున్న ఈ రోజుల్లో మీ హీరోయిన్ చేసిన పని పరమ పిచ్చి పని.

మీ కథ చూస్తుంటే మీకు అనుభవంగానీ, విజ్ఞానంగానీ లేదని తెలుస్తోంది. ప్రథమ సమాగమంలో కన్నెపిల్లకు గర్భం రాదు. ఆ ఇరువురికి ప్రథమానుభవమే అయితే, గర్భధారణ గారంటీగా జరగదని చెప్పచ్చు. మానవుని సెక్సు **జీవితం ఎనభై శాతం మనోమయం,**

ఇరవై శాతం దేహమయం. ప్రథమ పరిచయంలో వ్వారి, మనసులుగానీ, దేహాలుగానీ గర్భధారణ కనుకూలంగా ఉండవు. మానవులు జంతువులు కారని గ్రహించండి.

ఇక ఆరు నెలల గర్భిణీ స్త్రీని తండ్రి, అన్నలు బయటకు పదిమంది ముందు నెట్టరు. నూటికి తొంభై పాళ్ళు ఆ పిల్లను వాడి కంటగట్టడానికి ప్రయత్నిస్తార. సాధ్యంకాకుంటే ఏ మందోపెట్టి గుట్టుగా చంపి రట్టుగాకుండా తగలేస్తారు. లేదా మమకారం, డబ్బు ఉన్న వాళ్ళైతే దూర ప్రాంతాల కామెను తీసుకెళ్ళి పురుడు పోసి, బిడ్డను ఏ అనాథ శరణాలయంలోనో పారేసి గుప్‌చిప్‌గా పెళ్ళి చేస్తారు.

ఇక కడుపుతో ఉన్న దాన్ని పురుషుడెవడూ కామ దృష్టితో చూడడు. ఎందుకంటే, పురుషుని స్త్రీ వాంఛ అనేది ప్రకృతి అంతర్గతంగా నూతన సృష్టిని ప్రోత్సహించే రిఫ్లెక్సును అతడిలో ఉంచుతుంది. ఆ రిఫ్లెక్సు గర్భిణి స్త్రీనిగాని, వయసులో ఉండి ఎండుకుపోయిన దానినిగాని, వయస్సు పోయిన దానిని గాని చూడగానే చప్పబడుతుంది. ఏ శిక్ష విధించినా ఒప్పుకుంటాడు గాని, అలాటి స్త్రీని తాకడానికి ఒప్పుకోడు. ఏ పరిస్థితిలోనైనా ఆడవాసన తగలగావే మగాడు అమాంతం ఆమెను పీక్కుతింటాడని నమ్మకండి. అది చిన్నపిల్లలకు జాగ్రత్తకై బోధించే పెద్దలు పన్నిన బూచాడి కథ. ఎగ్జాంపుల్ కావాలంటే మీలాంటి అవివాహితులైన స్త్రీలు వేల సంఖ్యలో, లక్షలలో హాయిగా, నిశ్చింతగా పట్టణాల్లో ఉద్యోగాలు చేస్తూ చెక్కు చెదరక బ్రతకడం లేదా?

ఆ తరవాత నిండు చూలాలు ఏ పరిస్థితి లోనూ ఆత్మహత్య చేసుకోదు. కావాలంటే పందెం కాస్తాను. ఒక నిండు చూలాలు నిజ జీవితంలో ఆత్మహత్య చేసుకొన్నట్లు చూపండి — మీరు ఏ శిక్ష విధిస్తే అది భరిస్తాను.

మీ కామన్సెన్సు లేని బి. ఎ. హీరోయిన్ సమస్యకు మీరు చూపే పరిష్కారం ఇదా? ఇదేనా మీరు స్త్రీలోకానికిచ్చే సందేశం?

ఇలాటి తలా తోకా లేని కథలు, తీరని కోర్కెలతో రోగగ్రస్తమైన స్త్రీ మస్తిష్కంలోనుండిమాత్రమే వస్తాయి. ఫ్రిజిడిటీ, హిస్టీరియా ఇంకా ఎక్కువ దూరంలో లేవు. నా మాట విని విశాఖపట్నం వెళ్ళి సైకియాట్రిస్టును చూడండి. మీకు మగవారంటే మార్బిడ్ ఫోబియా ఉన్నట్లుంది. వ్యాధి ముదరక ముందే జాగ్రత్త పడడం మంచిది మీకూ, మీ పాఠకులకూ'' అని దులిపేశాడు. అది విని అంతా నవ్వేశారు.

ఇవన్నీ జ్ఞాపకం వచ్చి, చచ్చినా సరే కట్నం ఇవ్వక తప్పదన్న గోవిందరావు మాటలకు మోహిని క్రోధంతో ఇలా అంది: ''మీరు స్త్రీ ద్వేషులైతే కావచ్చు. మా నవలలు మీరు ముట్టుకోకపోవచ్చు. ఇంగ్లీషు నవలలే మీర్లు చదవచ్చు. మీకున్న స్త్రీ ద్వేషాన్నంతా ఉపయోగించి ఇబ్బడికి ముబ్బడిగా కట్నం వసూలు చేసుకో వచ్చు. కానీ, చచ్చిపోయిన ఆడవాళ్ళ దగ్గర గూడా కట్నం ఎలా వసూలు చేస్తారు?''

''చచ్చిపోయిన వాళ్ళ దగ్గర కట్నం వసూలు చేసే పద్ధతి తరవాత చెబుతాను. నన్ను స్త్రీ ద్వేషి అన్నారు. చాలా థాంక్స్. కానీ, కట్నం నేను తీసుకుంటానని మీ కెవరు చెప్పారు?''

''ఒకరు చెప్పే దేముంది? మీలాటి స్త్రీ ద్వేషులు స్త్రీలను బాధించడమే ఆశయంగా గలవారు గదా? ఎక్కువ కట్నం గుంజి, ఇంకా ఎక్కువగా ఏడిపించ వచ్చు.''

''అక్కడే మీరు పప్పులో కాలేశారు. మీరు ఎన్ని నవలలు వ్రాసినా, పురుష హృదయాన్వర్థం చేసుకోలేరు. స్త్రీని ద్వేషించే వాడు స్త్రీ ధనాన్ని గూడా ద్వేషిస్తాడు. నేను స్త్రీని ద్వేషిస్తున్నానంటే దానికి కారణం స్త్రీలంటే నాకు ద్వేషమని కాదు. ఈ కాలంలో ఆధునికత్వం అంతా జీర్ణించుకున్నామని అనే ఆడవాళ్ళ తలతిక్క ఆలోచనలంటే నాకు ద్వేషం. వీళ్ళ అర్థంలేని స్వార్థ పూరితమైన ఆశయాలంటే ఒళ్ళు మంట.''

''అర్థంలేని ఆశలా? వరకట్నం ఇవ్వకుండా పెండ్లి చేసుకుందామని ఒక ఆడపిల్ల ఆశించడం ఒక ఆశయం. ఆ ఆశయ సిద్ధికై పోరాడడం మా ధ్యేయం.''

''మీరు చెప్పేవి ఆశయాలు కావు; అత్యాశలు. ఆశయం అంటే ఏమిటి? ఆశయసిద్ధికై మన డబ్బు వదలాలి. దానికొరకు కష్టపడాలి. తీరా అది సిద్ధించిన తరవాత మనకు పైస లాభం ఉండరాదు. చూడండి...గాంధీ, నెహ్రూ, ప్రకాశం పంతులు—వీరు ఆశయం కలవారు. వారి ఆశయం దేశ స్వాతంత్ర్యం. అది సిద్ధించిన వెనక వారు బికారులయారు. దేశానికి లాభించింది. మీ ఆశయం వల్ల మీరు పడే కష్టాలేమిటి? ఏమీ లేదు. మీరు సంపాదించింది అలాగే మీ పేర బాంకులో వడ్డీతో పెరుగుతుంటుంది. మీ నాన్నగారు చనిపోతూ మీకు పంచి ఇచ్చిన ఆస్తి ఒక వైపు పెరుగుతూంటుంది. హాయిగా మీ కంటె రెట్టింపు సంపాదించే వాడు పైసా కట్నం తీసుకోకుండా పెండ్లి చేసుకొని కార్లమీదా, విమానాల మీదా తిప్పుతుంటే మీరు ఆశయసిద్ధికై పడ్డ కష్టాలేమిటి? అంత కఠినమైన ఆశయాన్ని సాధించి పోగొట్టుకున్నదేమిటి? మీ ఆశయ సిద్ధివలన మూడో వ్యక్తికి పైస లాభం కలిగినట్లు చూపగలరా? ఇప్పుడైనా గ్రహించండి — మీవి అత్యాశలు గాని, ఆశయాలుగావని. అదే మాట మగాడంటే దాన్ని ఆశయం అంటారు. దానివల్ల మాకు వచ్చే కట్నం క్షారం. పైగా మెడ కో గుదిబండ. పెండ్లామంటే ఏమిటి? మేము బ్రతికి ఉండగా రెండూ బై మూడోవంతు జీతమూ, వదిలేస్తే అర్ధజీతమూ, ఛస్తే మూడోవంతు జీతమూ ప్లస్ ఇన్స్యూరెన్సు, ప్లస్ ప్రావిడెంట్ ఫండ్, ప్లస్ ఫామిలీ పెన్షన్, ప్లస్ ఫామిలీ సెక్యూరిటీ ఫండ్ తినేదన్నమాట. ఇన్ని ఇరకాటాలతో గూడిన వైవాహిక జీవితంలో ప్రవేశించడమే మా పురుషుల ధీర లక్షణం. సాంఘికంగా, ఆర్థికంగా ఇన్ని రక్షణలు కలిగిన భార్య ఉద్యోగం సంపాదించడం' కోసం మీరు వరకట్న మనే అడ్మిషన్ ఫీజు చెల్లిస్తున్నారు. ఉద్యోగంలో ఉండే ప్రాస్‌పెక్ట్స్‌నుబట్టి: ఈ రోజులలో మూడు వందలు ఇచ్చే ఉద్యోగానికైనా పరీక్ష ఫీజులూ, అడ్మిషన్ ఫీజులూ వసూలు చేస్తున్నారు గదా?''

''పరీక్ష ఫీజులకూ, వరకట్నాలకూ పోలికా? ఎంత అన్యాయంగా మాట్లాడుతున్నారు, గోవిందరావు గారూ!''

''ఏం? ఎందుకు పోలిక లేదండీ, మోహినిగారూ? నేను చేసే ఈ బుర్ర ఉద్యోగానికి మూడేండ్లు తిరిగి తిరిగి, పరీక్షలు వ్రాసి వ్రాసి మూడు వేలు ఖర్చు పెట్టుకొన్నాను. పోనీ, నేను కట్టిన పరీక్షల ఫీజు వల్ల నాకు ఉద్యోగ మిచ్చిన వారు కోటీశ్వరు లయారా అంటే అదీ లేదు. నా దగ్గర వసూలు చేసిన ఫీజులు నా పరీక్ష పేపర్లకు, కరెక్షన్ చేసిన వారి కిచ్చే ప్రతిఫలం క్రింద పోతుంది. అలాగే కట్నండబ్బునూ. ఎవడెంత కట్న మిచ్చినా పదహారు రోజుల పండుగ తర్వాత కాఫీ త్రాగను పైసా మిగలదు.''

''మీరు చెప్పేది నేను నమ్మను. వేలూ, లక్షలూ కట్నాలు తీసుకొనే వారు దానిని పైస ఖర్చు పెట్టకుండా దాచుకోవడం లేదా?''

''అలా ఎవరూ ఉండరు. లక్షలు కట్నాలు తీసుకొనే వారూ అంతంత ఖర్చులూ పెడతారు. అలాటి వాళ్ళ గొడవ మన కెందుకు? వారికి గొడవే లేదు. సమస్య అల్లా మధ్యతరగతి కుటుంబీకులకే. మొన్న మా స్నేహితుడికి వివాహం జరిగింది. కట్నం ఆరు వేలు అన్నారు. మూడు వేలు సొమ్ముల క్రింద, వేయి చీరల క్రింద, ఐదొందలు అత్తచీరె, బిందెలు, పళ్ళేలు వగైరాల క్రిందా మినహాయించుకొని పదిహేను వందలు వాడి నాయన చేతిలో పెట్టారు ఆడపెళ్ళివారు. వాడి నాయన వాడికో పాంట్, షర్ట్ కుట్టించి మిగతాది రైలు ఛార్జీల క్రిందా, ఆడపడుచు కట్నాల క్రిందా, గృహ ప్రవేశ సమారాధన క్రిందా అయిపుచ్చి ఇంకా ఐదొందలు చేతిని తగిలాయని అల్లాడాడు. పెళ్ళి అప్పుడు వాడు సన్నగా ఉండేవాడు. పెళ్ళాం కాపురాని కొచ్చిన రెండు నెలలలో అమాంతం లావైపోగా పాంటు పిర్రల మీదా, షర్ట్ వీపు మీదా పిగిలితే వాడి భార్య వాటిని స్టీలు సామానుల వాడి కేసి ఒక కప్పు, చెంచా తీసుకొంది. మొన్న వాళ్ళింటి కెళితే వాడు కప్పులో కాఫీ పోసి చెంచా వేసి ఇచ్చి, 'ఇదేరా నేను కట్నం క్రింద తీసుకొని పెళ్ళి చేసుకొన్నది' అన్నాడు. ఇంతలో వాడి భార్య సుడిగాలిలా వచ్చి, 'నమ్మకం డన్నయ్యగారూ! వీరు మా నాయ న్నష్టకష్టాలు పెట్టి ఈ ఆరు వేలు గుంజారు' అన్నది. వాడేమో చాటుగా—'ఇరవై నాల్గు గంటలూ ఇదే పోరురా — నేను కట్న మిచ్చాను. ముష్టి ఆరు సవర్ల బంగారమే పెట్టార అని. మొన్న నాకు ఒళ్ళు మండి, ఫో, నీ పుట్టింటికి కప్పు, చెంచా సంచిలో వేసుకొని అంటే—ఏడుస్తూ, సాధిస్తూ, దెప్పుతూ కొంపలోనుండి కదలక చంపుతున్నదిరా' అని మొత్తుకున్నాడు'' అన్నాడు గోవిందరావు.

''ఏమండీ! ఆడపిల్ల డబ్బుతో గృహ ప్రవేశ సమారాధనలు జరుపుకోకపోతే నేం? అది అన్యాయం గాదూ?''

''ఆడ బుద్ధి పోనిచ్చుకొన్నారు గాదు. మూడువేల రూపాయల సొమ్ములూ, వేయిన్నర చీరెలూ, నాలుగు వేలు కన్యాదాత పెళ్ళి ఖర్చులకూ పెట్టుకోకపోతే గానేం? అసలు మా స్నేహితుడు సింపుల్ పెండ్లి జరిపించ మన్నాడు. ఇష్టమైతే రిజిస్టర్ మారేజ్ చేసుకొంటా నన్నాడు. కానీ, కన్యాదాత ఒప్పుకోలే. పురోహితుడు జరిపే పెళ్ళే హిందూ మారేజ్ అక్ట్ ప్రకారం శిలాశాసనం లాగా గట్టిగా ఉంటుందట. ఇలా ఆర్భాటాలతో అన్నీ ఖర్చులు చేసుకొనేదీ, మగ పెళ్ళివారు మమ్మల్ని దోచేశారో అని గోల పెట్టేదీ మీ ఆడవాళ్ళే గదూ?'' అన్నాడు గోవిందరావు.

దీనితో ఆడా, మగా అందరూ డిస్కషన్‌లో పాల్గొన్నారు. తలో మాట అన్నారు. ఆఖరుకు ఆడపిల్లల తండ్రులు అతి కష్టం మీద సంపాదించిన డబ్బులు

ఎవ్వరికీ చెందక వృథాగా పోతున్నవి గనక ఈ ఆర్భాటపు పెళ్ళిళ్ళు మానుకోవాలె నని నిర్ణయించారు.

మోహిని అన్నది: "మీరు ఏమైనా చెప్పండి, గోవిందరావుగారూ! కట్నం తీసుకోవడం నీచం."

"నీచమే. కాదనను. ఇందాక నేను చెప్పిన మా ఫ్రెండ్ ఉదాహరణలో వాడి పాలు నైచ్య మెంత? ఒక కప్పు, చెంచా! మరి వాడి భార్య మెడలో వేలాడుతున్న మూడువేల రూపాయలకూ, ఆమె పెట్టెలో మగ్గుతున్న వేయి రూపాయల చీరెలకూ, సాదరు అయిదొందలకూ, ఆమె నాయన పెండ్లి ఖర్చులకు తగలేసిన నాలుగు వేలకూ... వెరసి ఎనిమిది వేలా అయిదొందుల రూపాయలకు పట్టని నైచ్యం మా స్నేహితుడికి మిగిలిన కప్పు, చెంచాకే పట్టిందంటారా?" అన్నాడు గోవిందరావు నవ్వుతూ.

"మీ ఫ్రెండ్ ఉదాహరణ అరుదు. కానీ, చాలామంది సొమ్ము సంబంధం లేకుండా ఇచ్చిన మొత్తం దాచుకోవటం లేదా?"

"అలా చాలా మంది చేయరు. ఒకవేళ అలాటి కక్కుర్తి మనుషు లున్నా, వారికే ఎందుకు పిల్ల నివ్వాలి? ఎందుకంటే, వాడి కో ఉద్యోగం ఉండి ఉంటుంది. వాడికి గనక పిల్లనిస్తే ఇందాక నేను చెప్పినట్లు వాడు బ్రతికినా, వదిలేసినా, చచ్చినా పిల్ల హాయిగా ఉంటుందన్న ఆశవల్ల గాదూ? ఆడవాళ్ళలా ఆశలు పెట్టుకొని, ఆశయాల పేరు చెప్పి వాడిని కట్నం అడగవద్దనడం ఎంత తెలివి తక్కువ?"

"మీరు చెప్పింది ఏమాత్రం నిజం కాదు. ఏ ఉద్యోగం లేని వాడు గూడా కట్నం అడుగుతున్నాడు. అసలు పాశ్చాత్య దేశాలలో కట్నం డబ్బులు ఆడపిల్లల దగ్గర అడుక్కోవటం ఉన్నదా?"

"పాశ్చాత్య దేశాల జోలికి పోవద్దు. ఎందుకంటే, ఆ దేశపు స్త్రీలు ఇరవయ్యో శతాబ్దంలో ఉంటే మీరు పాత రాతి యుగంలో ఉన్నారు. ఉన్నట్లుండి హఠాత్తుగా ఒక్క వరకట్నం విషయమే వాళ్ళ ననుసరించాలంటే కుదరదు. వాళ్ళలాగా స్వేచ్ఛగా తిరగండి. మగాళ్ళను మీ అంద చందాలతో ఆకర్షించండి. వాళ్ళను మీ పాదాల మీద పడవేసుకోండి. నచ్చక పోతే వాడిని వదిలి ఇంకొకణ్ణి పట్టండి. అది మీకు చేతనౌనా? మీరు వారిలాగా యూనివర్సిటీలో చదివినా, లోకల్ హోటళ్ళలో సర్వింగ్ చేయగలరా? మీతో సమ వయస్కుడిని గాని, తక్కువ వయసు గల వాడినిగాని ప్రేమించి పెండ్లి చేసుకోగలరా? అలా చేసి భర్తను చదివిస్తూ, ఉద్యోగం వచ్చేదాకా పోషించగలరా? అహా. అలా కాదు. ఎన్ని పౌడర్, స్నో, లిప్‌స్టిక్స్ వాడినా, ఎన్ని ఖరీదైన చీరెలు కట్టినా, ఎంత అందంగా ఉన్నా ఒక్క మగవాడిని—ఆఫ్టరాల్ ఒక్క మగవాడిని ఆకర్షించి పెళ్ళిలోకి దింపగలరా? మీ వల్ల కాదు. ఎంత చదివినా, ఎన్ని ఉద్యోగాలు చేసి ఊళ్ళేలినా, ఎన్ని నవలలు వ్రాసినా ముసలి తండ్రి రొంటిని డబ్బు కట్టి, చేతికి ఫోటో లిచ్చి దేశదేశాలకు పంపి మీ తరఫున, మీకోసం ఆ ముసలి తండ్రిచేత ఒక కుర్రాడిని లొ చేయించి పట్టుకొచ్చి మీ దగ్గర పడేయించుకునేంత నిస్సహాయత్వం మీలో పేరుకొని పోయింది. మీకు తెలుసా? ఇలా ఫోటోలు పట్టుకొని ఆఫీసుల వెంట అమ్మాయిల గుణగణాలు, అందచందాలు వర్ణించే ఆడపిల్లల తండ్రులను చూస్తే మా కసహ్యం, జాలి కలుగుతుంటాయి. ఇంకోరకం వాళ్ళు మొదటాట సినిమా అయిన తరవాత ఇలాగ ఫోటోలు పెట్టుకొని వెంట పడుతుంటారు."

"ఛీ! ఛీ! ఎంత అసహ్యంగా మాట్లాడగలరు మీరు! తన కూతురికి వరుని తెచ్చే ఆడపిల్ల తండ్రిని ఎంత నీచంగా చిత్రించారు! మన సంప్రదాయ మెంత పవిత్రమైనది! ఈ దేశపు స్త్రీలు పెద్దల మాట మన్నించే వారు. భారత నారి ఎవర్ని పడితే వాణ్ణి చేసుకోదు. చేసుకుందా — జీవితాంతం వాడితోనే ఉంటుంది. అస లీ దేశం పురుషులే చెడ్డవారు. మాలో ఇంకా సంప్రదాయం మిగిలి ఉంది. పురుషులే అన్ని విధాల ఈ దౌర్భాగ్యపు స్థితికి కారకులు. పాశ్చాత్య దేశాలే స్త్రీల పాలిట స్వర్గసీమలు" అన్నది మోహిని ఆవేశంగా.

"దూరపు కొండలు నునుపు. పాశ్చాత్య దేశాలకు మకుటాయమానమైన అమెరికా (యు. ఎస్.) జనాభా మన దేశపు జనాభా కంటే సగానికి చాలా తక్కువ. కానీ, అక్కడ రేప్ కేసులు మన దేశంలో కంటె వందరెట్లు, సెక్స్ మర్డర్స్ వేయి రెట్లు ఎక్కువ. ఆ దేశాలతో పోల్చి చూస్తే మన దేశమే స్త్రీల పాలిట నందనవనం. అక్కడ ఆఫీసర్‌కి పెర్సనల్ సెక్రటరీ, స్టెనో అంటే ఉంపుడు కత్తె అని అర్థం. ఆడది ఒంటరిగా ఇంట్లో ఉన్నా, తలుపులకు గొలుసులు బంధించి ఉంచుతారు. రాత్రిళ్ళు ఆడది తన ఇంట్లోనైనా ఆరుబయట పడుకున్న దంటే ఆమెపై అత్యాచారం జరగడం ఖాయం. ఇప్పుడు చెప్పండి— ఏది భూలోక స్వర్గమో?"

"మీ రెన్నైనా చెప్పండి. ఇప్పు డీ దేశంలో పెండ్లికాక నిలబడిపోయిన ఆడవా రెందరో ఉన్నారు కదా? వారంతా వరకట్నా లిచ్చుకోలేకనో లేక ఇచ్చుకోవడం ఇష్టంలేకనో అలా ఉన్నారు. మరి ఇదంతా మీ మగవాళ్ళ వల్లనే గదా?"

"ఏమీ కాదు. నే నన్నట్లు అత్యాశ, మీ మూర్ఖ సంప్రదాయపు వ్యామోహం. నూరుగురు మగవాళ్ళకు తొంభై మంది ఆడవాళ్ళు గల దేశంలో ఆడదై పుట్టి గూడా ఒక్క మగవాణ్నాకర్షించి పెండ్లిలోకి దింపలేని తెలివితక్కువతనం. ఆశయాల తెరల మాటున ఆడవాళ్ళ అత్యాశలు నిలుపుకోవడం వల్ల— మీ కంటే వయస్సులో, చదువులో, సంపాదనలో, ఆస్తిపాస్తులలో, అందచందాలలో అధికుడు కావలెనని కోరి, అట్టి వాడి నందుకునే శక్తి గాని, అర్హత గాని లేక బిగదీసుకుని, అటువంటి వాడు కట్నం లేకుండా వచ్చి మిమ్మల్ని చేసుకోవాలని ఊహాలోకాల్లో విహరించడం వల్ల అలా మిగిలిపోయారు. మీరు ఎస్. ఎస్. ఎల్. సి. పాస్ అయిన దగ్గిరనుండీ, కాలేజీలో చదివేటప్పుడూ, ఉద్యోగం చేసేటప్పుడూ పెండ్లిండ్లలో, పేరంటాలలో, సినిమాలలో మీ వెంట రోమియోలు పడలేదా? కేవలం మీ చూపులలో పడదామని ఆత్రతను వ్యక్తం చేసిన వారు మీకు తగలలేదా? ఆరాధనా భరితమైన చూపులతో, మాటలతో మీ చుట్టూ తిరగలేదా? అలా చూసే వాళ్ళలో ఎంతమంది ఉద్యోగస్థులు, వ్యాపారస్థులు, లక్షాధికార్ల బిడ్డలు, గౌరవనీయులు ఉన్నారో మీకు తెలుసునా? అందులో కనీసం కొంతమందికైనా, మీ పెద్దలు పది వేలు పట్టుకొని పోయి పెండ్లి సంబంధం మాట్లాడడానికై వారి గుమ్మం ఎక్కడానికైనా అర్హత లేనంత ఉన్నతమైనవా రున్నారు. అరేదులో ఇన్ని సంవత్సరాలుగా ఒక్క వివాహ యోగ్యుడిని కనిపెట్టి, పెండ్లిలోకి దింపలేని మీ విజ్ఞానాలూ, చదువులూ ఎందుకు? అడుక్కుతిననా? అటువంటి వారికంటే అత్యంత హీనుడు, ఏ పరిస్థితులలోనూ మీ వంక స్టడీగా ఒక్క నిమిషంపాటు కన్నెత్తి చూడలేని సంప్రదాయపు దౌర్భాగ్యుడి దగ్గిరికే మీ తలిదండ్రులను, అన్నలను పంపి వారింకో వెయ్యి కట్నం అదనంగా అడుగుతున్నారని ఏడుస్తూ కూర్చోవడమే భారత నారీ సంప్రదాయమా? ఆడబిడ్డ లాంఛనాలూ, ఆర్భాటపు పెళ్ళిళ్ళూ, సొమ్ములూ, చీరెలూ సంప్రదాయపు భర్తా కావలసిన మీకు ఒక్క వరకట్నంలోనే విప్లవం రావాలా? అదీ మగవారి వద్ద నుండి! మీరు మాత్రం మీ మూర్ఖ సంప్రదాయం నుండి అడుగు బయట పెట్టరు."

"మేమూ ఆధునిక పద్ధతులు ఇష్టపడతాం. ప్రేమ వివాహాలు మీ కంటే మాకే ఎక్కువ ఇష్టం. కానీ, మీ మగాళ్ళే ఏ వివాహం అయినా కట్నాలు కావాలని మొండిపెట్టు పట్టుకొని కూర్చుంటారు. అసలు ఈ తరం మగవారికి ఆదర్శాలు పూజ్యం; ఆవేశం శూన్యం. కట్నాల ఆశ జాస్తి."

"మీ రన్నది శుద్ధ అబద్ధం. ఈ తరం యువకులకున్న ఆవేశం, కార్యదీక్ష ఈ హిందూ దేశంలో వేదకాలంనుండీ లేదు. కాలేజీ ఎన్నికలలో, ఆటల పోటీలలో, రాజకీయ చైతన్యంలో ఈ నాటి యువకు లెంతో ఆవేశపరులు. పది పైసలు ఫీజు పెంచితే కాలేజీల్లో స్ట్రైక్ చేసి, పోలీస్ ఫైరింగ్ నెదుర్కొని ప్రాణాలొడ్డిన యువకులున్నారు. అడ్వెంచెరస్ స్పోర్ట్సులో ఎంతో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. కానీ, వరకట్నం విషయంలో, ఆదర్శ వివాహం విషయాల్లో యువకు లెందుకు మందకొడిగా ఉన్నారు? ఎందుకంటే, కేవలం వ్రాయనూ, చదవనూ మాత్రం నేర్చి తమ మస్తిష్కాల్లో మెదిలిన ఆశలనే భావ ప్రకంపనలని పొరపడి, పూర్వాపర విజ్ఞానం లేని మీ ఆడవాళ్ళు రెండు దశాబ్దాలుగా ఈ రంగంలో దూకి, పుంఖానుపుంఖాలుగా రచనలు చేసి, వాటిని ఆర్థిక లాభాలు, సినిమా సెన్సారుల దృష్టిలో ఉంచుకొని, వ్యాపార సరళిలో రచనా వ్యాసంగం నడిపి, యువతుల నీ రంగంలో ఆశపోతులనుగానూ, యువకులను నీరసులుగానూ చేసి విడిచారు. కొవ్వలి, చలం, కొడవటిగంటి, లత లాంటి రచయితలు (త్రులు) హిందూ భావాల్ని వేదకాలం నుండీ జుట్టు పట్టుకొని లాక్కొచ్చి ఇరవయ్యో శతాబ్దంలో పడవేస్తే వారు మళ్ళీ రెండు శతాబ్దాలు వెనక్కు నెట్టారు. ప్రేమ వివాహాల్లోనూ, ఆదర్శ వివాహాలలోనూ సకృత్తుగా ఆడవాళ్ళకు జరిగే నష్టాల్ని భయంకరంగా చిత్రించారు. పెద్దలు తెచ్చే సాంప్రదాయిక సంబంధాలే గొప్పవని ధ్వనింపజేశారు. కాలేజీలలో, స్కూళ్ళలోను ప్రకృతి సహజంగా మగపిల్లలు వేసే జోకుల్ను నీచంగా చూపారు. ప్రేమికులంటే చెరో ఇరవై గజాల దూరంలో కూర్చుని వరకట్న సమస్యలు, సమాన హక్కుల ఉద్యమాన్ని గురించి మాట్లాడుకోవడమేనని అసహజంగా వ్రాశారు. మీ ఉద్యమాల్లోని అవకతవకలను గురించి నోరెత్తిన వాణ్ణి 'గీ' అంటూ గోల పెట్టి వాడి మాట వినపడకుండా చేశారు. మీ మాటలకు తందాన అంటే తానె తందనాన అన్న ఆడంగిరేకుల వాళ్ళ నాకాశాని కెత్తారు.

ఈ రెండు దశాబ్దాలుగా కోకొల్లలుగా రచనలు చేసి వార, పక్ష, మాస పత్రిక



హంస గీత

ఫోటో— ఎస్. ఎన్. రావు ( మద్రాసు – 78)

లన్నింటినీ మహిళా పత్రికల క్రింద మార్చేసి, అందులో ఫెమినైన్ సెంటిమెంట్సును గుప్పించి మగాడికి చదువుకోవడానికి పత్రిక లేకుండా చేశా రాంధ్ర దేశంలో. గతిలేక నాటినే చదివిన యువకులు ఈ వరకట్న ఆదర్శ వివాహరంగంలో నీరసులై, భావ విప్లవ రహితులై, విస్తేజులై పడి ఉన్నారు. యువతులు ఆశపోతులై మీ రచయిత్రులు అందించిన ప్రేమ అనే మహా మంత్రాన్ని జపిస్తూ, ఆ మంత్రశక్తి వలన తమకంటే గొప్పవాడు, ఎక్కువ సంపాదనపరుడు, అందగాడు ఏ క్షణాన్నైనా వచ్చి కార్లో ఎగరేసుకు పోతాడని కలలుకంటూ, నిజ జీవితంలో అలాటి వాడు తారసపడక, తమ అర్హతలకు అందిన వాళ్ళని ఆమోదించలేక వృద్ధ కన్యక లైపోతున్నారు. వాళ్ళను స్వార్థాని కుపయోగించుకుంటున్నారు కుటుంబ సభ్యులు.

అర్థరహితంగా తమ కష్టాల కన్నింటికీ పురుషులే బాధ్యులని తిట్టుకుంటూ, తన చారలనే తుడిచేసుకుందామనేటువంటి పులిని చూచి నక్క వాత పెట్టుకొన్నట్టుగా, మేమూ కుటుంబాల్ని పోషిస్తాం, బ్రహ్మచారిణులలాగే ఉండిపోతాం అంటూ సమర్థించుకోచూస్తారు. పాపం. అయినా, కుటుంబాల్ని పోషించడం, బ్రహ్మచర్యంలో ఉండటం పురుషుడికే సహజం. స్త్రీలకు కాదు. కుక్క చేసే పని గాడిద చేస్తే దాని నడుము విరగక తప్పదు'' అన్నాడు గోవిందరావు గంభీరంగా.

''నిజంగా మీరు స్త్రీద్వేషులేనండీ. ఏం? మేమొమాత్రం కుటుంబానికి పెద్దగా ఎందుకు ఉండరాదు? మాకు నచ్చేవా డొచ్చేవరకూ బ్రహ్మచారిణులుగా ఎంత కాలమైనా సరే ఉండే హక్కు మాకెందుకు లేదు?''

''మీ కా హక్కు లేదు. పేపర్లలో, మీటింగులలో అరిచి గోలచేసి చట్టరీత్యా, సాంఘికంగా అలాంటి హక్కును సంపాదించు కొన్నందుకు మీ కొరిగే దేమీ లేదు. అసలు ప్రకృతే మీ కా హక్కు నివ్వలేదు. మీరు సైన్సు వార్తలు చదవరా? పద్దెనిమిది సంవత్సరములకు బిడ్డను కనని స్త్రీకి యుటెరైన్ కాన్సర్ రావచ్చు. పాతిక సంవత్సరముల లోపల పది సంవత్సరములపాటు స్తన్యమివ్వని స్త్రీకి బ్రెస్ట్ కాన్సర్ రావచ్చు. జీవితాంతం పురుష స్పర్శ లేని స్త్రీకి పై రెండు వ్యాధులే గాక, దీర్ఘాయుష్షు కలిగి, గుండె, మెదడు ఆరోగ్యంగా ఉన్నా, మిగతా దేహమంతా కొద్దిగా కొద్దిగా చస్తూ, మంచాన పడి తీసుకొని తీసుకొని చస్తుంది. మీకు ఊహ తెలిసినప్పటి నుండి మీకు తెలిసిన బాల వితంతువుల లాంటి బ్రహ్మచారిణుల జీవితాల్ని ఎనలైజ్ చేసుకొని, వారెలా పోయారో తెలుసుకొని వారి చరిత్రలు తెలుసుకోండి. సత్యం మీకే బోధపడుతుంది. ప్రకృతి మాతకు ముద్దుబిడ్డ స్త్రీయే కాని, పురుషుడు కాదు. ఆమెకు పాత ధర్మశాస్త్రాలంటే గౌరవంగానీ, ఆధునిక విప్లవాత్మకపు స్త్రీల ఆలోచన అంటే ఇంటరెస్ట్‌గానీ లేదు. ఆ నియమాల నుల్లంఘించిన వారిని కఠినంగా శిక్షిస్తుంది ...''

అంతా మౌనంగా ఉన్నారు. ఆలోచనల్లో పడ్డారు. మళ్ళీ మొదలుపెట్టాడు గోవిందరావు.

''బ్రహ్మచర్యంలో ఉన్న పురుషుని వల్ల, సంతానవతి అయిన స్త్రీవల్లనే మానవజాతి మనగలిగింది. స్త్రీ ఔన్నత్యం మాతృత్వంలోనూ, పురుషుని ఔన్నత్యం బ్రహ్మచర్యంలోనూ ఉన్నాయి. వారి కా దశలోనే ఉన్నతమైన, నిజమైన ఆనందం కలుగుతుంది. ఒకరు జాతి భావ ప్రగతికి ఆధారమైతే, ఒకరు జాతి పెంపుదలకు ముఖ్యం. ప్రకృతి ధర్మమిట్లుండగా దానిని ధిక్కరించిన వారికి ప్రకృతి ప్రసాదించిన శిక్షలు తప్పవు. లేదూ మా ఇష్టం, మేం ఆ దారినే పోతామని మీలాంటి స్త్రీలంటే అలాగే కానివ్వండి. నిరభ్యంతరంగా పొండి. బ్రహ్మచారిణులుగా ఉంటే ఎవ్వరూ మిమ్మలను శిక్షించబోవడంలేదు. కానీ, అలా ఉండడం మా హక్కు అని ఒక నాలుకతో అని, మరో నాలుకతో మా అవస్థకు మగాళ్ళే కారణమని దూషించకండి. అలా సాహిత్యాన్ని కలుషితం చేయకండి. ఎందుకంటే, మీరు రోమియోలన్నా, బాడీ గార్డులని ఎగతాళిచేసినా, విసుగు చెందని విక్రమార్కులలాగా మిమ్ములను వెంబడించి, అంటకాగి మిమ్ములను పెండ్లిలోకో, ప్రేమలోకో దింపుదామని [illegible]లా ప్రయత్నం చేసి వాళ్ళ డ్యూటీ పూర్తిచేసుకొన్నారు కొందరు మగవారు. మీ తండ్రి, అన్నలు వారి శక్త్యనుసారం మీకు కొన్ని సంబంధాలు తెచ్చారు. ఆశయాల ముసుగులో అత్యాశలను దాచుకొని, కండ్లు మూసుకొని, బోటు తప్పిన బాటసారిలా ఇద్దరినే మిగిలిన మీరు, మిమ్మల్నే నిందించుకోవలసి ఉంటుంది. మాత్న యౌవనంలో ఉన్న యువతీ యువకులకు మీ ఫ్రస్ట్రేషన్‌నూ, ఉడుకుమోతుతనాన్నీ నవలల ద్వారా పంచిపెట్టి కొద్దిగా ఉండేవారి పాకెట్ మనీని, ఇంకా కొద్దిగా ఉండే స్త్రీ పురుష పరస్పర సంబంధమైన మధుర భావనలనూ కొట్టేయకండి'' అన్నాడు గోవిందరావు.

మోహిని భద్రకాళియే అయింది. ఆమె దేహం క్రోధంతో ఊగిపోయింది. ఎటూ తేల్చ వీలులేని స్త్రీ పురుష సమస్యలను గురించి అనర్గళంగా రోజుల తరబడీ వాదించగలిగిన మోహినికి స్పెసిఫిక్‌గా తననే, తన లాంటి వాళ్ళ సమస్యలనే ఇంత దారుణంగా విమర్శించే గోవిందరావును మింగివేయాలన్నంత కోపం వచ్చింది. కానీ, ఈ నడుమనే తననెంత అణగద్రొక్కా లనుకున్నా అణగని ఆత్మ విమర్శ గోవిందరావు మాటల్ని విని అమాంతంగా పెరిగి మోహిని కంఠాన్ని పట్టుకొని మాట రాకుండా చేసింది. క్రోధంతో మోహిని మనస్సు ఘూర్ణిల్లుతున్నది.

ఇంతలో మాయ భర్త అందుకున్నాడు: ''గోవిందరావుగారూ! ఇంతవరకు మీ రిద్దరూ నేల విడిచి సాము చేశారు. మొదట్లో మీ రన్నారు, మోహినిగారితో — చచ్చినాసరే కట్న మీయక తప్ప దన్నారు—జ్ఞాపకం తెచ్చుకోండి.''

''ఆఁ. అవునండి. చెప్తుతాను. కాని, ఈ సంగతి చెప్పమనండి మోహినిగారిని'' అంటూ మోహిని వైపు అనుమానంగా, కొద్దిగా భయంగానే చూచాడు.

మోహినికి కోపం ఇంకా తగ్గలేదు. అయినా, మౌనంగానే ఉన్నది.

''ఏ సంగతండీ?'' అడిగాడు మాయ భర్త మోహిని తరఫు నవకాల్తా పుచ్చుకొని.

''మోహినిగారు దేవుడినీ, పుణ్య పాపాలనూ, స్వర్గ నరకాలనూ, హిందూ మతాన్నీ విశ్వసిస్తారా?'' అడిగాడు గోవిందరావు.

మాయభర్త అన్నాడు: ''అందుకు సందేహం ఏముంది? మోహినిగారిని ఇన్నాళ్ళుగా చూస్తున్నాము — వారు నిత్యం భగవంతుని పూజ చేస్తారు. పేరంటాలకూ, గుళ్ళలోకి వెళతారుగదా?''

''అయితే, తప్పదు. మోహినిగారు కట్నం మేళాగూ ఇచ్చి పెండ్లి చేసుకోరు. వారు కోరిన లాటి పురుషుడు వారి కిక తగలడనే బ్రహ్మచారిణిగా ఉండిపోదా మను

కున్నారు. కానీ, చనిపోయాక తప్పదు కట్నం మీయక" అన్నాడు హాస్య ధోరణిలో మోహినివైపు చూస్తూ.

కోపం ఉద్భృతం తగ్గగా మోహిని అంది ఎద్దేవాగా: "గోవిందరావుగారూ! ఇందాకటి నుండి అడ్డుగోలుగా మాట్లాడి సమర్థించుకొన్నారు. చచ్చిపోయినదాని దగ్గర కట్నం ఎలా తీసుకుంటారు? దీనిని నిస్సందేహంగా నిరూపించండి. ఇందాక మీ పై వచ్చిన కోపాన్నంతా తుడిచేసుకుంటాను."

"ఎలాగంటే, మనం భారతీయులం. మీ రన్నట్లు భారతీయ సంప్రదాయాన్ని పాటించేవాళ్ళం. స్త్రీలు వివాహం కాకుండా చచ్చిపోతే వాళ్ళకు కర్మచేయాలి. చేయకుంటే అలాటి స్త్రీల జీవాత్మలు ప్రేతాలుగా ఈ భూలోకంలోనే పడి ఉండి, అందమైన చీరగట్టి, మొగుడితో సంసారం చేసే అమ్మాయిలను పీక్కుని తింటాయి. అందుకని మీకు ఇష్టం లేకపోయినా, మీ బంధువులు ప్రేతల బెడద తప్పించుకోవడానికైనా కర్మ చేయక మానరు. అయితే, కర్మచేయడం అనేది వివాహితులైన స్త్రీలకే పరిమితం. అవివాహిత అయిన స్త్రీ అంటే స్పిన్‌స్టర్ చనిపోతే ఏం చేయాలో ధర్మశాస్త్రాలు చెప్పలేదు. ఎందుకంటే, అలాటి వారు ఈ భారతదేశంలో నిన్న మొన్నటిదాకా లేరు. అందుకని అప్పుడు చనిపోయిన అవివాహిత స్త్రీకి పెండ్లి లాంటి తంతు జరిపిస్తారు. చిక్కేమిటంటే, చచ్చిపోయిన ఆడదాని మెళ్ళో ఏ గౌరవనీయుడూ పుస్తె కట్టడు. రేపటెల్లుండిలో చచ్చే ముసలాణ్ణో, పిచ్చివాణ్ణో, భయంకర రోగగ్రస్థుణ్ణో తీసుకొస్తారు. వా డప్పుడు భీష్మించుకొని కూర్చుంటాడు. ఐదు రూపాయల నుండి వంద రూపాయల దాకా పుచ్చుకొని, అప్పుడు పుస్తె కట్టి ఆ శవానికి కర్మ చేసుకునే అధికారాన్ని ఇస్తాడు. ఇప్పుడు చెప్పండి— ఈ డబ్బును ఏమంటారు?... మానవ జీవితం బుద్బుదప్రాయం... ఎప్పుడు పోతుందో తెలియదు. కట్నం లేకుండా తన కంటే పెద్ద ఆఫీసర్నీ, తనకంటే విద్యావంతుడినీ అందగాణ్ణీ చేసుకుందామని బిగుసుకుని, కూర్చుని, నిజ జీవితంలో అలాటి వాడు చిక్కక, జీవితాంతం వేచి ఉండి హఠాత్తుగా చనిపోయి, ఏ నికృష్టుని చేతనో పుస్తె కట్టించుకోవడం కంటే కట్నం ఇచ్చో, ఇవ్వకో, వయస్సు, చదువు, అందాలలో సరిసమానుడినో, తక్కువ వాడినో, ఆఖరుకు ఏ నిరుద్యోగినో నచ్చి, వాణ్ణి పెండ్లి చేసుకొని ప్రకృతి ధర్మాలను నెరవేర్చుకొని ఇహవరాలు సంపాదించుకోవడం వివేకవంతమో, కాదో తేల్చుకోండి."

"మీరు చెప్పేది ... అదే అంత్యక్రియలకు సంబంధించినది నిజమేనా?" అడిగింది మోహిని అనుమానంగా చూస్తూ.

"కనుక్కోండి — ఏ పురోహితుణ్ణయినా."

మోహినికి ఒళ్ళంతా జలదరించింది. అయిదు రూపాయలకోసం చేయిజాస్తూ పసుపుకొమ్ము, పచ్చతాడూ చేతబట్టుకొని ఖౌళ్ళుఖౌళ్ళుమని దగ్గుతూ ఒక నికృష్టుడు బోసినోటితో నవ్వుతూ, కర్ర పోటేసుకొని తన వైపు వస్తున్నట్లుగా మోహిని మనో నేత్రానికి గోచరించింది. అంతే. మాటా పలుకూ లేకుండా తన పోర్షన్ కెళ్ళి తలుపు వేసుకొని మంచం మీద పడుకొని ఆలోచనా సంద్రంలో మునిగిపోయింది. ఆ రోజు రాత్రి మోహిని భోజనం చేయలేదు.

• • •

రెండు రోజుల తరవాత గోవిందరావు ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో మోహిని పోర్షన్ కొచ్చాడు. ఆ రోజు ఆదివారం.

"మోహినిగారూ! ఈ రోజు ఉదయం నుండీ పచ్చి కాఫీ చిక్కలేదు. హోటళ్ళు స్ట్రైక్ అట. ఒక కప్పు కాఫీ ఇచ్చి పుణ్యం కట్టుకోండి" అంటూ గోవిందరావు కుర్చీలో కూలబడ్డాడు.

మోహిని రెండో డోసు క్రింద ఉంచుకొన్న ఫ్లాస్క్ లోని కాఫీ కప్పులో పోసి తీసుకొని వచ్చి గోవిందరావు కిచ్చి, "ఈ రోజు భోజనం మా ఇంట్లోనే చేయండి. హోటళ్ళన్నీ స్ట్రైక్ అంటున్నారు గదా?" అన్నది.

"మీ కెందుకులెండి ఆ శ్రమ" అని మర్యాదగా అందామన్నా వీలులేని పరిస్థితిగా ఉంది. సరే, కానివ్వండి. ఏమైనా కూరా నారా తేవలసి ఉంటే ఆ సంచీ ఇలా పడెయ్యండి" అన్నాడు గోవిందరావు.

"ఏమీ అవసరం లేదు. మీ రలా కుర్చీలో కూర్చుని మాట్లాడుతూ ఉండండి. ఇలా గంటలో వంట పూర్తి చేస్తాను. కానీ, టేక్ కేర్. సౌమ్యంగా మాట్లాడండి. లేకుంటే మీ వాదనలతో నాకు ఒళ్ళు మండిందంటే ఆ తరవాత మీకు నోరు మండుతుంది" అన్నది మోహిని నవ్వుతూ.


"ఏం ఫర్వాలేదులెండి. టిఫిన్ కారేజీ నిండా నెయ్యుఉందిగా. లేకుంటే తెస్తాను" అన్నాడు గోవిందరావు.

"అంతేగాని, మీ మొండి వాదనలు మాన నంటారు? అది సరే. ఇన్నాళ్ళుగా మీవి పాత భావాలని అనుకుంటుండేదానిని. కానీ, మీకు స్త్రీ స్వాతంత్ర్యం అంటే అయిష్టం లేదనిపిస్తుంది."



తేజవరాలు

చిత్రం—చిలుకూరి ఆంజనేయులు ( కరీంనగర్ )



మకరంద మాధురి ఫోటో— బి. శ్రీశైలం ( సికందరాబాదు )

"అది నిజమే. ఈ నాటి స్త్రీకి కావలసిన స్వాతంత్ర్యం ఉంది. పెండ్లి చేసుకోవడానికీ, మానడానికి, పతివ్రతగా ఉండడానికీ, బజారుపాలై పోవడానికి, ఇంకా వారి కిష్టం వచ్చినట్లు బ్రతకడానికీ అవకాశా లున్నాయి. కానీ, ఏ లైన్‌లో జీవితాన్ని నడుపుకుంటున్నా, అందులో ఉండే కష్టాలకు మగాళ్ళే కారకులనే ఆడవారిని చూస్తే నాకు ఒళ్ళు మంట. మగవారికి గానీ, ఆడవారికిగానీ జీవితం అనే మహా నాటకంలో సుఖాల కంటే కష్టాలే అధికం. వాటిని విజ్ఞతతో పరిష్కరించుకొని తదనుగుణంగా జీవించడమే మన ధ్యేయంగా ఉండాలి. అసలు మీ స్త్రీ స్వాతంత్ర్య నినాదం మీ కేమి మేలు చేసిందో నాకు తెలియదు కానీ, మా పురుషులకు దానివల్ల అపారంగా మేలు జరిగింది."

"అదెలాగండి?!"

"సింపుల్. చూడండి — స్త్రీకి భర్తగా, తండ్రిగా, సోదరుడుగా, కొడుకుగా బాధ్యతలు వహించడం కష్టం. ఈ కష్టకాలంలో మరీ నరకం. తల్లినీ, భార్యనూ, వితంతువులైన లేక అవివాహితులైన అప్పచెల్లెళ్ళనూ, అలాటి దూరపు దగ్గర బంధువులనూ, దాయాదులనూ భరించడం నరకం. ఇంకా అలాంటి అప్పచెల్లెళ్ళు, పిన్నమ్మలు, మేనత్తలు, వదినెల్లు, మరదళ్ళు—వీళ్ళ సంతానాన్ని వీరి భర్తలు పోతే పూర్వం ధర్మశాస్త్రప్రకారం భరించాలి. వారి సంతానానికి విద్యాబుద్ధులు గరపించాలి. వాళ్ళను ప్రయోజకుల్ని చేయాలి. లేకుంటే ధర్మశాస్త్రం, సంఘం ఒప్పుకోవు. ఈ రకమైన బంధాలనుండి మీ స్త్రీస్వాతంత్ర్య నినాదం మమ్మ ల్నుద్ధరించింది. ఈ లంపటం నుండి మాకు విముక్తి దొరికింది. ఒక్కడు సంపాదించడం, పదిమంది తినడం లాంటి అవస్థ తప్పింది. లేదా ఇంకా కొద్దికాలానికి పూర్తిగా పోతుంది. వెనకటి రోజుల్లో దుర్మార్గుడైన భర్త నుండి తప్పించుకో దలచిన లేక భర్తలు పోయిన సోదరీమణులు ఒక హక్కు క్రింద పుట్టిళ్ళకు చేరేవారు. ఇప్పు డా హక్కు పోయింది. అక్కచెల్లెండ్ల పెండ్లిండ్లకై అప్పులు చేసి, వాళ్ళ పెట్టుపోతలకై సంసారాలు గుల్ల చేసుకుని, ఆ దిగుళ్ళతో అర్ధాయుష్షు పాలై పో నవసరంలేదు. ఇష్టం ఉంటే హాయిగా పెండ్లి చేసుకొని కొద్ది సంసారాలతో ఉంటాం, లేదా బ్రహ్మచారులమై హోటళ్ళను పోషిస్తూ ఆరోగ్యాన్నీ, ఆధ్యాత్మిక అభివృద్ధిని పొందుతాం.

"ఇంకో సంగతి చూచారా! ఇప్పటి మా స్వాతంత్ర్యాన్ని చూసి అప్పుడే కొందరు ఆడాళ్ళు కుళ్ళుకుంటున్నారు. అందగత్తెలైనవారికి ప్రపంచం ఎప్పుడూ హాయిగానే ఉంది. వాళ్ళకోసం పూర్వం యుద్ధాలు చేశాం. ప్రస్తుతం కుత్తుకలు కోసుకుంటున్నాం. ఇకముందు బుర్రలు బద్దలు కొట్టుకుంటాం. అది అటుంచండి. కాని, అపారమైన మన సోదరీమణులలో మెల్లకంటివారు, మిట్టపళ్ళ వారు, పొట్టి జడలవారు, పొడుగు దేహపువారు, నీల దేహపువారు, పోలియో గ్రస్థులు, డబ్బులేని వారు, తండ్రిలేని వారు, వితంతువులు, మొగుడు వదిలిన విధవలు అపారంగా ఉన్నారు గదా? వారంతా వారి కవసరం లేని స్వాతంత్ర్యాన్ని చేతబట్టుకొని అవివాహితులుగా మిగిలిపోయి బాధలు పడతారు. స్త్రీ పురుషులకు సెలెక్షన్‌లో సంపూర్ణ స్వేచ్ఛను డిమాండ్ చేసే స్త్రీ ఉద్యమాల లాంటివి వారికి చూపే పరిష్కార మేమిటి? తిన్నమ్మకే ఆకలెక్కువని, అంద చందాలు కలిగి, ఆస్తిభాగాలు పొంది, స్వతంత్రమైన ఉద్యోగాలు చేస్తూ, ఇంకా ఇంకా బెనిఫిట్స్ పొందాలనే ఉద్యమం చేసే మీరు దురదృష్ట వంతులైన మీ సోదరీమణుల కేం చేస్తున్నారు? సంఘంలో రాజీ పడిపోవలసిన వారికి పోరాటాన్ని నేర్పి వాళ్ళ బ్రతుకు ల్నింకా అధ్వాన్నం చేస్తున్నారు. అలాటి వారు కొన్నాళ్ళు బాధల ననుభవించి మన దేశంలోని పూర్వ పరిస్థితులను వింటారు. అనాకారులూ, అంగవికలులూ ఈ దేశంలో ఇంతకు ముం దెప్పుడూ అవివాహితులుగా మిగిలి పోలేదని గమనిస్తారు.

అప్పుడు మళ్ళీ రొద. మగాళ్ళే కుట్ర పన్ని స్త్రీ స్వాతంత్ర్య ఉద్యమాన్ని దొడ్డిదోవ పట్టించారని ఆడిపోసుకుంటారు. 'అరెరే. ఎంత పొరబడ్డామో?! కందుకూరి, గాంధీజీ మగాళ్ళనే సంగతే మరిచిపోయాము! వెనక సంప్రదాయం అనీ, ధర్మశాస్త్రమనీ మగాళ్ళ మెడలు వంచి అనాకారులనూ, అంగ వైకల్యం గలవారినీ అంటగట్టాము. ఆలోచన లేకుండా ఆ బంధాల్ని సడలించాము. మళ్ళీ ఏదో ఆలోచించి ( మగాళ్ళ సహాయం లేకుండా ) చట్టాల ఉచ్చులు పన్నకపోతే మనలో దురదృష్టవంతుల గతేమిటి?' అని ఆలోచించక పోరు."

అన్నంలో కలియబెడుతున్న గరిటె చేతపట్టుకొని మోహిని గోవిందరావు కుర్చీ దగ్గరి కొచ్చింది. గోవిందరావు కపట భయంతో ఒక పక్కగా వాలాడు, చేతులు రెండూ నెత్తిమీద పెట్టుకొని. ఆ జోకేను నవ్వుతూ పట్టించుకోకుండా అన్నది మోహిని:

"ఎంత ఆశ్చర్యం! మా అన్నలు, తమ్ముళ్ళు అచ్చు మీలాగానే బాధ్యతా రహితంగా మాట్లాడతారు, నా మంచీ చెడులు పట్టించుకోకుండా. అదేమంటే నీవు స్వతంత్రురాలివి అని చెప్పుతారు. అసలు వారు పట్టించుకొంటే ఇప్పటికే చాలా సంవత్సరాల క్రిందటనే నా ఆశయాలకు తగిన సంబంధాలు తెచ్చేవారు. వారు వారి ధర్మాన్ని మరిచి నన్ను నా కర్మకు వదిలారు—దుర్మార్గులు" అంది మోహిని ఉక్రోషంగా.

పకపకా నవ్వాడు గోవిందరావు. "మోహినిగారూ! ఎంత చదివినా, ఎంత ఆధునికులైనా మీరు నే నన్నట్లు పాత రాతియుగంలోనే ఉన్నారు. మీరు భారత దేశపు పౌరులు. మీకు పద్దెనిమిది సంవత్సరాలు దాటినాయి. ఈ దేశపు ప్రధానిగా ఎవరు ఉండాలో మీరు నిర్ణయించగలరు.

స్త్రీ స్వాతంత్ర్యాన్ని సంపూర్ణంగా ఆమోదించారు. పిత్రార్జితాన్ని సమానంగా పంచుకొన్నారు. మీ సోదరులు మీ వివాహం విషయంలో ఎందు కవస్థ పడాలి? మీ ఆశయాలకు ( ఆశలకు ) తగిన సంబంధం తేవలసిన అగత్యం వారి కేముంది? అందుకై ఊరూరూ తిరిగి, అడ్డమైన వారి కాళ్ళు పట్టుకోవలసిన కర్మ వారి కేమిటి? అసలు ప్రతి పండుగకు పిలిచి భోజనం పెట్టి, చీరలు ఏ చట్ట ప్రకారం మీకు ముట్టచెప్పాలి? మీరు మీ జీతంలో వారి కుటుంబాల కేమిస్తున్నారు?"

"అదేమిటండీ! అలా అంటారు? అప్పచెల్లెళ్ళకు పెట్టడం, బాగోగులు చూడడం మన సంప్రదాయం, ధర్మశాస్త్ర మెలా ఉన్నా!"

"అదే శుద్ధ తప్పు. ధర్మశాస్త్రాన్ని

మంగలం తొక్కిన వాడే సంప్రదాయాలు గంగలో కలిశాయి. ఇప్పుడు మీ అన్నలు మీ వలెనే స్వతంత్ర భారత పౌరులు. మైనారిటీ తీరిన మరో వ్యక్తికి పెట్టి చాకిరీ చేయడం వారి స్వాతంత్ర్యానికి భంగం. అలా ఆశించడం చట్ట విరుద్ధం. మీ అన్నల ప్రాథమిక హక్కులకు భంగం.''

''ఏమిటండీ! మరీ అన్యాయంగా మాట్లాడతారు. ఇప్పుడు బజారున పడి నా పెండ్లి సంబంధం నేనే చూచుకోనా?!''

''కరెక్ట్. ఇప్పుడే గాదు, ఎప్పుడో చేయవలసిన పని అది. మీకు వచ్చిన వాడుంటే—'హేయ్, మిస్టర్! పెండ్లి చేసుకుందామా?' అని అడగండి. 'వా డొప్పుకొంటే సరే. లేకుంటే ఇంకోడు. పురుషులతో సమానమైనప్పుడు, మళ్ళీ పురుషుల సహాయంతో సంబంధాలెందుకు వెతుక్కోవాలి? సిగ్గూ, చింతకాయ పచ్చడీ అనేవి బానిసత్వంలో మగ్గే పూర్వకాలపు మహిళలకు. మీ లాంటి లిబరేటెడ్ ఉమన్‌కి కాదు. కనక మీ పెండ్లికొడుకును మీరే ఏరుకోవాలి; ఎన్నుకోవాలి. పెండ్లి పనులు చేసుకోవాలి—స్నేహితుల సాయంతో గానీ, స్వంతంగాగానీ. మీ బ్రదర్సు పిలుంటే రావచ్చు. లేకుంటే గ్రీటింగ్స్ పంపవచ్చు. ఇది ఆధునిక ధర్మం. స్త్రీ స్వాతంత్ర్యానికి పరాకాష్ఠ. అంతేకాని, సమాన హక్కులను, సమానమైన ఆస్తులను, సమానమైన ఉద్యోగాలను పీట క్రింద వేసుకొని, వెధవల్లారా వెతకండి—నా కో కట్నం తీసుకొని కలెక్టర్ మొగుణ్ణని మీ అన్నల ననడం అన్యాయం.''

వంట పూర్తి కావడంతో మోహిని గోవిందరావును భోజనానికి లెమ్మని చెంబుతో నీళ్ళూ, తుండూ ఇచ్చింది. గోవిందరావు కాళ్ళు కడుగుకొని పీట మీద కూర్చోగా వడ్డించింది మోహిని. ఏవో పిచ్చాపాటీ కబుర్లు చెప్పుకుంటూ భోజనం ముగించాడు గోవిందరావు. మోహినికి వాదనలలో పెనకటి ఉత్సాహం, విజిగీష కనబడటం లేదు. ఆమె మనసు మరెక్కడో లగ్నమైనట్లుంది. భోజనం చేసి గోవిందరావు కుర్చీలో వచ్చి కూర్చున్నాడు.

తాంబూలం అందిస్తూ గోవిందరావుతో మోహిని ఇలా అంది: ''గోవిందరావుగారూ! పాశ్చాత్య దేశాలలో వధువు కంటె వరునకు తక్కువ వయస్సున్నా గూడా వివాహాలు జరుగుతా యన్నారు. నిజమే నంటారా?''

''శుభ్రంగా జరుగుతాయి.''

''అలాంటి వివాహాలలో మగవాడు ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సుకు గురి అయితే ఆ దాంపత్యం నరకప్రాయం గాదా?''

''కాంప్లెక్సులంటూ దాంపత్యం జీవితంలో ప్రవేశిస్తే ఏ కాంప్లెక్సైనా కాపురాలు తీయగలదు. ఓడిపస్ కాంప్లెక్సు, గిల్టీ కాంప్లెక్సు, పెర్సిక్యూషన్ కాంప్లెక్సు, సుపీరియారిటీ కాంప్లెక్సు—అన్నీ ప్రమాదకారులే. దాదాపు నూటికి తొంభైమందికి ఏదో ఒక కాంప్లెక్సు ఉంటుంది. అయితే, ఈ ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సే మన దేశంలో అందరికీ తెలుసు. అంతెందుకు? మీలోనూ ఒక కాంప్లెక్సు ఉంది. బహుశః నాలోనూ ఉండవచ్చు. అయితే, అది ఉన్నట్లు మనకు తెలియదు.''

''ఏమిటీ! నాలోగూడా ఒక కాంప్లెక్సుందా? ఏమిటి చెప్పండి, చూదాం'' అన్నది మోహిని ఉత్సాహంగా.

''మీలో పెర్సిక్యూషన్ కాంప్లెక్సుంది. ఈ ప్రపంచమంతా, ముఖ్యంగా మగాళ్ళు మిమ్మలను నిష్కారణంగా బాధిస్తున్నారన్న కాంప్లెక్సు ఉంది. ఏ మగాణ్ణి చూచినా, వాడి మెడలో ఎవరికీ కనబడని కట్నాల లేబుల్ బిళ్ళ పదివేలు అనీ, ముప్పై వేలు అనీ మీకు కనబడుతుంది. మీతోబాటు చిలుక పలుకులు పలకని మగాడు తరతరాలుగా స్త్రీ జాతిని అణగ దొక్కిన టాస్క్ మాస్టర్‌గా కనబడతాడు. అలా పలికిన వాడు నయవంచకుడుగా, సమయం దొరికినప్పుడు మిమ్మల్ని కాల్చి మసిచేసి నీళ్ళలో కలుపుకొని తాగేవాడుగా కనబడతాడు. అలాకాక మీరు ఏ మగవాణ్ణయినా చూచినప్పుడు అందగాడు, ప్రయోజకుడు, వివాహ యోగ్యుడనిగానీ, లేక అనాకారి, అప్రయోజకుడని మాత్రం గానీ అనిపిస్తుందో ఆ క్షణాన మనస్సు ఈ కాంప్లెక్సు కబంధ హస్తాలనుండి విడివడిందని తెలుసుకోండి. అయితే, ఇలాటి లోపాలు మనలో ఉన్నాయని గ్రహించడానికి గూడా విశేషమైన మనో నిబ్బరం అవసరం.''

మోహిని గోవిందరావు వంక తదేకంగా నిరాలంబమైన మనస్సుతో చాలాసేపు అలా చూస్తూ ఉన్నది. రెండు నిమిషాలు, ఐదు నిమిషాలు అలానే చూస్తున్నది.

చిత్ర ప్రతిమలాగా అలా నిలబడి తన వంక శూన్యంగా చూస్తున్న మోహిని పరధ్యానంలో పడిపోయిందని గ్రహించి గోవిందరావు వెళ్ళిపోవడానికి కుర్చీలో నుండి లేచాడు.

మోహిని గోవిందరావుని వారించింది.

''ఈ సంగతి చెప్పండి — అందరి సంగతి ఎందుకు? మీకంటె ఎక్కువ వయస్సు, చదువు కలిగిన పిల్లను మీరు పెండ్లి చేసుకోగలరా?''



వలపు బాన చిత్రం— కె. వాణి ( యూవాది పెట్టు )

గోవిందరావు ఉలిక్కిపడ్డాడు.

మోహిని కంఠధ్వనిని, ఆమె ముఖ కవళికలను చాలాసేపు పరిశీలించాడు

''నిస్సందేహంగా. నేను చేసుకొదలచుకొనే పిల్లలో నాకు కనిపించేవి వయస్సు, చదువు, సంపాదన, కట్నం, కానుకలుగాదు ...''

''మరేమిటి?''

''అవి చాలా ఉన్నాయి. లిస్టు చెబితే చాలా టైము పడుతుంది. ఒక్కమాటలో చెప్పనా?''

''చెప్పండి.''

''నన్ను పెండ్లి చేసుకోండి. నాకు కావలసినవి మీలో చాలా ఉన్నాయి.'

ఆశ్చర్యంగా చూచింది మోహిని గోవిందరావు వైపు. సంభ్రమంతో పులకించిం దామె దేహం. పగుళ్ళు తీసి, బీటలు వారిన ఆమె హృదయం ద్రవించింది. తన మనోభావాన్ని గ్రహించి తనే బయటపెట్టేదాకా ఆగక గోవిందరావే ముందుగా ప్రపోజ్ చేసినందుకు మనస్సులోనే జోహార్లు అర్పించి ఇలా అన్నది: ''మీ రంతగా అడుగుతున్నారు... అలాగే ... కానివ్వండి.''

మరుసటి రోజు రాత్రి ఏడు గంటలకు ఆ ఇంట్లో సింపుల్‌గా డిన్నర్ జరిగింది. ఆ రోజు ఉదయం పదకొండు గంటలకు మోహిని, గోవిందరావులకు స్నేహితుల సమక్షంలో రిజిస్టర్ మారేజి జరిగింది. నూతన దంపతుల నందరూ అభినందించారు.

ఆదర్శ వివాహం అన్నారు కొందరు.

''ఏడ్చారు. ఇదో పెళ్ళా! తత్కారం జోళ్ళు తగిలించుకున్న ( జోళ్ళ తత్కారంవి కాదనుకోండి ) ముసలమ్మకూ, మీసకట్టు రాని పసి వెధవకూ ( తప్పింది గాని క్లీన్ షేవ్డ్ ఫేస్ ) పెండ్లేమిటి?''

అన్నారు కొందరు అటు బాహాటంగా కాకుండా, ఇటు చాటుగా కాకుండా.

మోహినికి ఈ అరిచే కుక్కల అరుపులు తను పూర్వం అవివాహితగా ఉన్నప్పుడు విన్న నాటి వలె కర్కశంగా కాక శ్రావ్యంగా, బలహీనంగా తోచినవ్వుకున్నది.

ఆ నాడు రాత్రి పది గంటలకు మోహిని జాతకంలో సప్తమాధిపతి అయిన శుక్రుడు, ఉచ్చలో శుభ గ్రహ వీక్షితుడై ఉండగా శుక్ర మహార్దశ ప్రారంభమైంది. *

## అంకితం

అంతర్జాతీయ మహిళా సంవత్సరంలో అతివల అభ్యుదయానికై అతిగా వెలువడిన సాహిత్యాన్ని చదివి అజీర్తిలో పడిన అబ్బాయిలకూ, అమ్మాయిలకూ పంధ్రదున కొక నూలు పోగన్నట్లు, ఇదొక నాయుపోత.